జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
## సిద్దిపేట
ఆదివారం | 14 | జూన్ | 2026 | పేజీలు : 6





### టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు... ట్రాఫిక్ జామ్



3 లో



# ప్లాస్టిక్ ప్రాణాంతకం

- జిల్లాలో ప్లాస్టిక్‌పై అవగాహన కరువు
- నిషేధం అమలులో అధికారుల నిర్లక్ష్యం
- విచ్చలవిడిగా సాగుతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం

సిద్దిపేట, జూన్ 07 (ప్రజాజ్యోతి): ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం ప్రజల దైనందిన జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది. ఉదయం పాల ప్యాకెట్ల నుంచి రాత్రి ఆహార పదార్థాల ప్యాకింగ్ వరకు ప్రతి అవసరానికి ప్లాస్టిన్‌నే ఆధారపడుతున్నారు. అయితే సౌకర్యం పేరుతో పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికే కాకుండా మానవ ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పుగా పరిణమిస్తోంది. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం జిల్లాలో రోజురోజుకు పెరుగుతుండగా, దీనిని అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్లాస్టిక్ వ్యర్థాలు నేలలో కలిసిపోకుండా వందల సంవత్సరాల పాటు అలాగే ఉండిపోతాయి. ఫలితంగా భూసారం దెబ్బతినడంతో పాటు వ్యవసాయ భూముల ఉత్పాదకత కూడా తగ్గిపోతుంది. వర్షపు నీటితో కలిసి చెరువులు, వాగులు, నదుల్లోకి చేరే ప్లాస్టిక్ వ్యర్థాలు జలచరాల మనుగడకు ప్రమాదంగా మారుతున్నాయి. ప్లాస్టిక్ కాల్చడం వల్ల విడుదలయ్యే విషపూరిత

మిగతా 2లో..

### డిసిసిబి పగ్గాలు
## మళ్లీ చిట్టికే ?
### సోమవారం బాధ్యతల స్వీకరణ

6 లో





4 లో

## అమర్నాథ్‌లో అన్నపూర్ణగా సిద్ధిపేట



## జేఈఈ అడ్వాన్స్డ్ లో గట్లమల్యాల విద్యార్థిని ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ సీటు కైవసం!



నంగునూరు, జూన్ 13 ప్రజా జ్యోతి: జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్డ్-2026 ఫలితాల్లో మండల పరిధిలోని గట్లమల్యాల గ్రామ విద్యార్థిని మోర వర్ష అద్భుత ప్రతిభ కనబరిచారు.శనివారం విడుదలైన జోసా మొదటి విడత సీట్ల కేటాయింపులో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఇఖిఉ) సీటును సాధించింది. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్లో ఆల్ ఇండియా స్థాయిలో 1544వ ర్యాంక్ సాధించగా, ఓబీసీ కేటగిరీలో 263వ ర్యాంకుతో ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకు న్నారు. జేఈఈ అడ్వాన్స్డ్ మాత్రమే కాకుండా ఇటీవల విడుదలైన వివిధ పోటీ పరీక్షల్లోనూ వరుస ర్యాంకులతో తన విజయకేతనాన్ని ఎగురవేసింది. జేఈఈ మెయిన్స్-2026 పరీక్షలో ఏకంగా 99.92 పర్సంటైల్ సాధించింది. ఆల్ ఇండియా స్థాయిలో 1362వ ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో 235వ ర్యాంక్ సొంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన టీజీ ఎప్సెట్-2026 పరీక్షలోనూ రాష్ట్ర స్థాయిలో 148వ ర్యాంక్ సాధించి తన అసాధారణ ప్రతిభను చాటుకుంది. విద్యార్థి తల్లిదండ్రులు బింగి కవిత, మోర గణేశ్ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యా యులు కావడం విశేషం. తండ్రి మోర గణేశ్ కొహెడ మండలం గుండా రెడ్డి పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి బింగి కవిత నంగునూరు మండలం బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తు న్నారు. వర్ష పెద్ద నాన్న మోర మోహన్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి ఇంట్లో ఉన్న విద్యా వాతావరణం, తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం, విద్యార్థి పట్టుదల, కఠిన శ్రమే ఈ అద్భుత విజయానికి కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థ అయిన ఐఐటీ బాంబేలో, అదీ ఎంతో డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ గ్రూపులో సీటు సాధించడంతో విద్యార్థి స్వగ్రామమైన గట్ల మల్యాల గ్రామంతో పాటు సిద్దిపేటలో వ్యక్తమవుతున్నాయి. జిల్లా గర్వించదగ్గ విజయాన్ని సాధించిన ఈ విద్యార్థిని, అతని తల్లిదండ్రులను గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు బంధుమిత్రులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

## నిరుపేద కుటుంబానికి హరీశ్‌రావు ఆర్థిక సాయం



నారాయణరావుపేట, జూన్ 13 ,(ప్రజా జ్యోతి) :నారాయణరావుపేట గ్రామానికి చెందిన భూదాసు వెంకట్ (25) పని చేస్తూ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్రావు తక్షణ సాయంగా 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.స్థానిక నాయకులు ఘటనను హరీశ్రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి కుటుంబానికి అండగా నిలిచారు. హరీశ్రావు తరపున నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేసి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంగరం ఎల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి ఎల్లయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొనేయగారి ఎల్లయ్య, నాయకులు కొమిరి ప్రకాష్, భూదాసు అశోక్, కొమిరి రాజు, వార్డు సభ్యులు రాజు, వేణి, రవి, తునికి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ ప్రాణాంతకం

మొదటి పేజీ తరువాయి..

వాయువులు వాతావరణ కాలుష్యానికి దారితీస్తున్నాయి. ఇవి శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రమాదకర అనారోగ్యాలకు కారణమవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు తాగునీరు, ఆహారం ద్వారా మానవ శరీరంలోకి చేరుతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఇవి శరీరంలోని వివిధ అవయవాల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### జిల్లాలో పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం

సిద్దిపేట జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం అమలు కేవలం కాగితాలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దుకాణాలు, హోటళ్లు, కూరగాయల మార్కెట్లు, మాంసం దుకాణాలు, టీ స్టాళ్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ప్లేట్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు బహిరంగంగానే విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.ప్రభుత్వం పలుమార్లు ప్లాస్టిక్ నిషేధంపై ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు కనిపించడం లేదు. అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నప్పటికీ అవి తూతూ మంత్రంగానే మిగిలిపోతున్నాయని ప్రజలు అంటున్నారు. ప్లాస్టిక్ తయారీ, నిల్వ, విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ యథాతథంగా మారుతోంది.

### అవగాహన కార్యక్రమాలు కరువు

ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో కూడా అధికారులు విఫలమయ్యారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో, మార్కెట్ ప్రాంతాల్లో, విద్యాసంస్థల వద్ద ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన హెచ్చరిక బోర్డులు, ప్రచార ఫలకాలు కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే అవగాహన కార్యక్రమాలు దాదాపు లేకపోవడంతో ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని సహజంగా భావిస్తున్నారు. ప్రతి ఇంటిలో, ప్రతి దుకాణంలో ప్లాస్టిక్ వాడకం అధికంగా ఉండటంతో పర్యావరణానికి జరుగుతున్న నష్టంపై చాలామందికి పూర్తి



అవగాహన లేదని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తేనే ప్రజల్లో మార్పు వస్తుందని వారు సూచిస్తున్నారు.

### ప్రత్యామ్నాయాల వినియోగమే పరిష్కారం

ప్లాస్టిక్కు బదులుగా గుడ్డ సంచులు, జనపనార సంచులు, వెదురు ఉత్పత్తులు, కాగితపు సంచులు, మట్టి పాత్రలు, తాటి ఆకులతో తయారైన వస్తువులను వినియోగించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. మార్కెట్లకు వెళ్లే సమయంలో ప్రజలు తమ వెంట గుడ్డ సంచులను తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలని, వ్యాపారులు కూడా ప్లాస్టిక్కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్

జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలంటే మున్సిపల్ ,కాలుష్య నియంత్రణ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించడం, అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయడం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

# బంగారం మెరిపిస్తామని మోసం

## ఎనమిది గ్రాముల బంగారం కాజేసిన కేటుగాళ్లు
## వెంకట్రావుపేట గ్రామంలో మోసానికి గురైన మహిళ

తొగుట, జూన్ 13 (ప్రజాజ్యోతి): బంగారు ఆభరణాలను కొత్తవాటిలా మెరిపిస్తామని నమ్మబలికి మహిళలను మోసం చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం ఇద్దరు యువకులు ఈ తరహా మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు తమ వద్ద ఉన్న ప్రత్యేక పౌడర్, లిక్విడ్తో బంగారం, వెండి ఆభరణాలను తెల్లగా చేసి మెరిపిస్తామని మహిళలకు తెలుపగా వారి మాటలు చాలా మంది నమ్మలేకపోయినా, చివరకు గ్రామానికి చెందిన కళ్లెపు అనూష ఇంటికి వెళ్లిన సదరు వ్యక్తులు ముందుగా ఆమె చేతులపై పౌడర్ వేసి నమ్మకం కల్పించారు. ఆ తర్వాత అనూష మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, ఆమెతో పాటు ఆమె చెల్లి కాళ్లకు ఉన్న వెండి పట్ట గొలుసులను తీసుకుని శుభ్రం చేస్తామని నమ్మించారు. ఏదో రసాయన ద్రావణంలో వాటిని ముంచి కొంతసేపటి తర్వాత తిరిగి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం మహిళ ఆభరణాల బరువు తక్కువగా ఉన్నట్లు గమనించి బాధితులు స్థానిక బంగారు





దుకాణంలో తూకం వేయించగా మొత్తం బంగారంలో సుమారు ఎనమిది గ్రాముల బంగారం కరిగించి కాజేసినట్లు గుర్తించారు. దీంతో మోసపోయామని తెలుసుకున్న వారు తీవ్ర ఆందోళనకు గురై బోరున విలపించారు. బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఇలాంటి మోసాలు, దొంగతనాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపరిచితులు ఇంటికి వచ్చి ఆభరణాలు మెరిపిస్తామని, శుభ్రం చేస్తామని చెప్పినా ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న తొగుట పోలీసులు విచారణ చేపట్టి నిందితుల కోసం గాలిస్తున్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండి విలువైన ఆభరణాలను అపరిచితుల చేతికి ఇవ్వవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు టీవీలలో న్యూస్ పేపర్లలో చూస్తున్నా ఇంకా అవగాహన రాకపోగా వారిని నమ్మి నష్టపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఎడ్ల గురువారెడ్డి సేవలు మరిచిపోలేనివి





### జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి

### కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి

సిద్దిపేటఅర్బన్, జూన్13(ప్రజాజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో కామ్రేడ్ ఎడ్ల గురువారెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఎడ్ల గురువారెడ్డి సేవలు మరిచిపోలేనివి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిద్దిపేట తొలి ఎమ్మెల్యే ప్రజానాయకుడు కామ్రేడ్ ఎడ్ల గురువారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవి, రచయిత నందిని సిద్ధారెడ్డి ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పాల్గొని ప్రజల హక్కుల కోసం అంకితభావంతో పనిచేశారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని కొనసాగించిన గురువారెడ్డి సిద్దిపేటకు తొలి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని గుర్తు చేశారు.ఎడ్ల గురువారెడ్డి అధికారాన్ని ప్రజాసేవకు సాధనంగా భావించి, రైతులు, కూలీలు, పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. నేటి తరానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని, తెలంగాణ చరిత్రలో చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి, ప్రజా సేవలను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గురువారెడ్డి జీవిత చరిత్రను రాష్ట్ర పాఠ్యపుస్తకాలలో చేర్చి విద్యార్థులకు పరిచయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు డా పాపయ్య, సీనియర్ పాత్రికేయులు అంజయ్య , టీయూడబ్ల్యూజే (ఫ్లిగిఐ) జిల్లా అధ్యక్షులు రంగాచారి , మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు , సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఎడ్ల వెంకటరామిరెడ్డి , తదితరులు పాల్గొన్నారు..

## టోల్గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

### ట్రాఫిక్ జామ్



కొండపాక, జూన్ 13: (ప్రజా జ్యోతి ):-రెండు రోజుల వరుస సెలవులు కావడంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు, బయలు దేరిన వాహనదారులతో రాజీవ్ రహదారిపై భారీ రద్దీ నెలకొంది. కొండపాక మండల పరిధిలోని దుద్దెడ సమీపంలోని టోల్గేట్ వద్ద శనివారం వాహనాలు బారులు తీరాయి. టోల్ ప్లాజా వద్ద వాహనాల రాకపోకలు ఒక్కసారిగా పెరగడంతో కొంతసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. టోల్గేట్ దాటేందుకు కార్లు, ద్విచక్ర వాహనాలు, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలు పొడవైన క్యూలలో నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందివ్వాలి



కొండపాక జూన్ 13( ప్రజా జ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందివ్వాలని కుకునూర్ పల్లి ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు.కుకునూర్ పల్లి లో మధ్యాహ్న భోజన నిర్వాహకు లకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శనివారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలలు తెరిచే సమయానికి మధ్యాహ్నం భోజనం వంటశాలలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. వంటగది పరిసరాలను ప్రతిరోజు శుభ్రంగా ఉంచాలని వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాలతో కూడిన భోజనాన్ని పెట్టాలన్నారు. శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో చిన్న కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు చెన్న శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### దేశ రక్షణకు ఎంపికైన దొమ్మాట విద్యార్థులను

### ఘనంగా సన్మానించిన మాజీ సర్పంచ్ పూజిత వెంకటరెడ్డి



దౌల్తాబాద్, జూన్ 13: (ప్రజా జ్యోతి): దేశ రక్షణకు తనవంతు సేవను అందించేందుకు అగ్నిపథ్ ద్వారా ముగ్గురు దొమ్మాట విద్యార్థులను ఘనంగా సన్మానించిన మాజీ సర్పంచ్ పూజిత వెంకటరెడ్డి. శనివారం మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన బాసమైన అఖిల్, పొగాకు ప్రసాద్, బైరగారి అరవింద్ లు కేంద్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినటువంటి అగ్ని పథ్ లో సైనికులుగా ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగుల అవకాశాలు రావడానికి కష్టపడి చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలు దక్కుతాయని వారు సూచించారు ఇప్పటికే దొమ్మాట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులుగా చాలామంది ఉన్నారని తెలియజేశారు. ఇక ముందు కూడా విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించుకోవాలని సూచించారు. అగ్నిపథ్ నియామకం పట్ల దొమ్మాట గ్రామ ప్రజలు వారికి ఘనంగా సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఈదన్న గారి సింహాచలం, అహ్మద్, షబ్బీర్, స్వామి, ఎల్లం, కనకయ్య, సలీం, శ్రీనివాస్,, స్వామి, పరశురాములు, భాస్కర్, శ్రీనివాస్, వాసుదేవ్, నర్సయ్య, పోచయ్య, నర్సింలు, రాములు, సురేష్, కనకరాజు, యాదయ్య, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం లో నాణ్యతకు ప్రాధాన్యం



నంగునూర్ జూన్ 13(ప్రజా జ్యోతి):మండల కేంద్రమైన నంగునూరుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి శనివారం నాడు నిర్వహించిన మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో పురుమాండ్ల శ్రీనివాసరెడ్డి నంగునూరు, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో నిర్వహించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంఈవో శ్రీనివాసరెడ్డి సూచించారు.శనివారం నాడు నంగునూరులో నిర్వహించిన వంట నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంగునూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల విద్యాధికారి పురుమాండ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధికి కీలకమని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. భోజనం తయారీలో పరిశుభ్రత ప్రమాణాలు



పాటిస్తూ, నాణ్యమైన సరుకులను మాత్రమే వినియోగించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుకు అనుగుణంగా ఆహార పదార్థాల వినియోగం, నిల్వల నిర్వహణలో పారదర్శకత ఉండాలని తెలిపారు. వంటశాలలు, భోజనశాలలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహారం వడ్డించే సమయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. భోజనం నాణ్యతపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ప్రధానోపాధ్యాయులు, వంట నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఎంఈవో ఆదేశించారు. సమావేశంలో మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాలమాకుల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పోతిగంటి ప్రభాకర్ రావు సత్యనారాయణ టీ కనకయ్య మనీష్ కుమార్ సిఆర్పిలు పెంటయ్య మోహన్ బాబు రేణుక మరియు మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు పాల్గొన్నారు.

# అమర్నాథ్‌లో అన్నపూర్ణగా సిద్ధిపేట

## హిమాలయాల్లో తెలుగు రుచుల విందు

### 57 రోజులపాటు భక్తి సేవ

### దక్షిణాదిలో సిద్ధిపేటకే ఆ గౌరవం

### సేవా సంప్రదాయానికి 15 ఏళ్లు



సిద్ధిపేట,జూన్ 13 , (ప్రజాజ్యోతి):దేశంలోనే అత్యంత క్లిష్టమైన ఆధ్యాత్మిక యాత్రలలో ఒకటైన అమర్నాథ్ యాత్రలో వేలాది మంది భక్తుల ఆకలి తీర్చేందుకు సిద్ధిపేట మరోసారి సేవా సంకల్పంతో ముందుకొస్తోంది. మంచు కొండల మధ్య, ఎముకలు కొరికే చలిలో పరమశివుని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు తెలుగు వంటకాల రుచిని పరిచయం చేస్తూ, మానవసేవే మాధవసేవ అనే సందేశాన్ని చాటుతోంది. గత 15 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతున్న అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సేవలు ఈసారి కూడా మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది.అమర్నాథ్ యాత్రకు వెళ్లే దక్షిణాది రాష్ట్రాల భక్తులకు ఉత్తరాది ఆహారం మాత్రమే అందుబాటులో ఉండేది. తమ ప్రాంతీయ ఆహారం దొరకక వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు సిద్ధిపేటకు చెందిన కొందరు సేవాభావం కలిగిన వ్యక్తులను కదిలించాయి. భక్తుల కష్టాలను తగ్గించాలనే సంకల్పంతో 2011లో అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆవిర్భవించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వేలాది మంది యాత్రికులకు ఉచితంగా భోజనం, అల్పాహారం అందిస్తూ సేవా పరంపరను కొనసాగిస్తోంది. ఈ ఏడాది జూలై 3 నుంచి ఆగస్టు 28 వరకు జరగనున్న అమర్నాథ్ యాత్ర సందర్భంగా మూడు ప్రధాన కేంద్రాల్లో అన్నదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. బాల్తాల్ బేస్ క్యాంప్, పంచతరణి, అమర్నాథ్ గుహ సమీపంలో ప్రత్యేక వంటశాలలు ఏర్పాటు చేసి యాత్రికులకు ఉదయం నుంచి రాత్రి వరకు భోజన వసతి కల్పించనున్నారు. ఇడ్లీ, దోసె, ఉప్మా, పులిహోర, సాంబారు, పెరుగు అన్నం వంటి తెలుగు రాష్ట్రాల సంప్రదాయ వంటకాలను అందించనున్నారు.యాత్ర మొత్తం కొనసాగే 57 రోజులపాటు సమితి సభ్యులు స్వయంగా అక్కడే ఉంటూ సేవలు అందించనున్నారు. వేలాది మంది యాత్రికులకు ప్రతి రోజు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం ఏర్పాటు చేయనున్నారు. యాత్ర కోసం అవసరమైన బియ్యం, పప్పులు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, వంట సామగ్రితో కూడిన లారీని ఈ నెల 15న సిద్ధిపేట నుంచి పంపించనున్నారు. స్థానిక శరభేశ్వర ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం ఈ లారీని ప్రారంభించనున్నారు.ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణలు సరుకుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించనున్నారు.అమర్నాథ్ యాత్రికులకు దక్షిణాది భోజనాలు అందిస్తున్న సేవా కార్యక్రమాల్లో సిద్ధిపేటకు ప్రత్యేక గుర్తింపు లభించింది. వేలాది మంది భక్తులు ప్రతి ఏడాది ఈ శిబిరాలను ఆశ్రయిస్తూ తెలుగు వంటకాల రుచిని ఆస్వాదిస్తున్నారు. యాత్రికుల నుంచి లభిస్తున్న ప్రశంసలు సేవా సమితికి మరింత ఉత్సాహాన్ని అందిస్తున్నాయి. శనివారం సిద్ధిపేట లోని ప్రసన్నంజేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్షుడు నందిని శ్రీనివాస్ సరుకుల రవాణా వివరాలను తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మాంకాల నవీన్, కోశాధికారి గుబ్బ లింగమూర్తి, ఉపాధ్యక్షులు గోపిశెట్టి శరభయ్య, జిల్లా శ్రీనివాస్, అనిల్ శ్రీనివాస్, అయిత రత్నాకర్, గౌరవాధ్యక్షులు కాచం కాశీనాథ్, సలహాదారులు గంప శ్రీనివాస్,చీకోటి మధు మాడిశెట్టి భాస్కర్, రాజూరి వెంకటేశం, ఉప్పల కృష్ణమూర్తి, సముద్రాల రమేశ్, దుందిగల్ల నాగరాజు, పోశెట్టి శ్రీకాంత్, కూర శేషు తదితరులు పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్లిన వ్యవసాయ విస్తీర్ణ అధికారి

### సంతోషిని ఘనంగా సన్మానించిన

### మాజీ సర్పంచ్ పూజిత వెంకటరెడ్డి




దౌల్తాబాద్, జూన్ 13: (ప్రజా జ్యోతి) బదిలీపై వెళ్లిన దౌమ్మాట క్లస్టర్ సంతోష్ కుమార్ ను ఘనంగా సన్మానించిన మాజీ సర్పంచ్ పూజిత వెంకట. శనివారం మండల పరిధిలోని దౌమ్మాట క్లస్టర్ దౌమ్మాట ,సూరంపల్లి, గాజులపల్లి, ముత్యంపేట ,లింగరాజు పల్లి, గ్రామాలకు గత ఎనిమిది సంవత్సరాలుగా అపూర్వ సేవలు అందించి బదిలీపై పాపన్నపేట మండలం కు వెళుతున్న వ్యవసాయ విస్తీర్ణాధికారి సంతోష్ కుమార్ ను ఘనంగా సన్మానించమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌమ్మాట క్లస్టర్ కు చేసిన సేవలను ప్రశంసించి రైతులతో ఉన్న సంబంధాలను గుర్తు చేసుకొని ఉద్యోగరీత్యా బదిలీలు తప్పవు అని ఎక్కడైనా ఉద్యోగ పరంగా మీ సేవలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఈదన్న వారి సింహాచలం,మాజీ మండల్ కో ఆప్షన్ సభ్యులు ఎండి హుస్సేన్,మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కిష్టారెడ్డి,బోర్రోల్ల స్వామి ,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు,ఎండి ఖసీం,ఏఎంసీ డైరెక్టర్, రైతులు ఎండి షబ్బీర్,డి ఎల్లయ్య,ఈదన్న గారి చంద్రం,అక్క మొల్ల స్వామి, పేర్క ఎల్లం,ఈ.శ్రీనివాస్,ఎండి సలీం,గొల్ల నర్సింలు,డ్రైవర్ లాచయ్య,పొట్టి స్వామి గౌడ్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీఐ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ గణేష్ వెనిశెట్టి

సిద్ధిపేట, జూన్ 13 ,(ప్రజాజ్యోతి):అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియాసిద్ధిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన జిల్లా చైర్మన్ డాక్టర్ గణేష్ వెనిశెట్టి తెలిపారు.నూతన కార్యవర్గంలో జిల్లా చైర్మన్గా డాక్టర్ గణేష్ వెనిశెట్టి, వైస్ చైర్మన్గా డాక్టర్ అయిత శివ, జనరల్ సెక్రటరీగా డాక్టర్ రజనీస్, ట్రెజరర్గా డాక్టర్ సందీప్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ రాజుకుమార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ వెనిశెట్టి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి జిల్లా చైర్మన్గా ఎన్నుకున్న తోటి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధితో పాటు వైద్యుల వృత్తిపరమైన నైపుణ్యాల పెంపు, సంక్షేమం కోసం అంకితభావంతో కృషి చేస్తానన్నారు.జిల్లాలోని ఫిజీషియన్స్ మధ్య సమన్వయం పెంపొందించడం, వైద్యరంగంలో తాజా పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా శాస్త్రీయ సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### ప్రధానమంత్రి పోషణ్ శక్తి సమావేశం

### మండల విద్యాధికారి ప్రభుదాస్



దుబ్బాక ప్రతినిధి జూన్ 13 (ప్రజా జ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి ప్రభుదాస్ అన్నారు. శనివారం రోజున దుబ్బాక జిల్లా పరిషత్ బాలికల ఉన్న పాఠశాలలో ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణం కాంప్లెక్స్ సాయి ట్రైనింగ్ సమావేశంలో ముఖ్య అతిథిగా డి సి ఈ కన్వీనర్ చక్రపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మంచిగా అందించాలని వారానికి మూడు రోజులు గుడ్డు,జావా, తప్పనిసరి అందించాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్నం భూపాల్ మాట్లాడుతూ... ఈరోజు అజెండా వారిగా ట్రైనింగ్ నిర్వహిస్తున్నామని కార్మికులచే మధ్యాహ్న భోజనం వంటను పాఠశాలలో వడ్డించి, నిర్వహించి సన్నద్ధం చేయడం జరుగుతుందని దానికి తగిన ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. నిరంతరం పిల్లలకు మంచి భోజనం అందించడంలో కార్మికులు ముఖ్యపాత్ర వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజిత, ఆర్పి శ్రీనివాస్ ,కాంప్లెక్స్ కన్వీనర్ మధుసూదన్, సిఆర్పి రవి, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన కార్మికులి పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి

## బాలికకు తీవ్ర గాయాలు



కొండపాక, జూన్ 13: ప్రజా జ్యోతి ):-మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో శనివారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కరీం నగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు, రోడ్డు దాటుతున్న మతిస్థిమితం లేని మహిళను తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వారిపైకి దూసుకెళ్లింది.స్థానికుల కథనం ప్రకారం, రాధవ అనే మతిస్థిమితం లేని మహిళ రోడ్డు దాటుతుండగా వాహనం ఆమెను ఢీకొట్టింది. అనంతరం అదుపు తప్పిన కారు రోడ్డు పక్కన ఇంటి ముందు కూర్చున్న లచ్చవ్వ అనే మహిళను కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాధవ, లచ్చవ్వలు ఘటనాస్థలంలోనే మృతిచెందారు.అదే సమయంలో సమీపంలో ఆడుకుంటున్న ఓ బాలికకు కూడా వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలికకు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనతో దుద్దెడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పాము కాటుతో వృద్ధురాలు మృతి



దుబ్బాక, జూన్13 (ప్రజా జ్యోతి):- రేకుల షెడ్డులో నిల్వ కట్టెలను తీస్తుండగా పాము కాటుకు గురై వృద్ధురాలు మృతి చెందిన ఘటన దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కే.కీర్తి రాజు తెలిపిన వివరాలు.... రామక్క పేటకు చెందిన గంగల లక్ష్మి (60) అనే వృద్ధురాలు ఇద్దరు కుమారులతో కలిసి జీవనం కొనసాగిస్తుంది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం తన ఇంటి ముందు గల రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన కట్టెలను పైకితీస్తున్న క్రమంలో గుర్తు తెలియని పాము ఆమె కుడి చేతిపై కాటు వేసింది.వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధురాలు లక్ష్మి మృతి చెందింది. మృతురాలి కుమారుడు చంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యం



సిద్దిపేట, జూన్ 13 ,(ప్రజాజ్యోతి):సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపి, ప్రజలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలంటే కమ్యూనిస్టు భావజాలం అత్యంత అవసరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ప్రత్యామ్నాయ మార్గాలను చూపిన చరిత్ర కమ్యూనిస్టు ఉద్యమానిదేనని ఆయన అన్నారు.శనివారం సిద్దిపేటలోని కార్మిక కర్షక భవన్లో నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను పార్టీ జెండా ఆవిష్కరణతో ప్రారంభించారు. అనంతరం శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడిన చుక్కా రాములు, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ఈ పరిస్థితులకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయ మని, చైనా అభివృద్ధి అందుకు ఉదాహరణగా నిలుస్తోందని చెప్పారు. రాబోయే కాలంలో సమాజ మార్పుకు కమ్యూనిస్టు భావజాలం మరింత అవసరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అభిప్రాయపడ్డారు.స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కుల కోసం పోరాడుతూ ప్రత్యామ్నాయ విధానాలను చూపింది కమ్యూనిస్టు ఉద్యమమేనని ఆయన గుర్తు చేశారు. సమాన పనికి సమాన వేతనం, సామాజిక న్యాయం, ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాజిక అసమానతలు వంటి సమస్యలపై రాబోయే రోజుల్లో మరింత సమరశీల ఉద్యమాలను నిర్మించి ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.అనంతరం కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రపై సీపీఎం రాష్ట్ర నాయకులు బండారు రమేష్ శిక్షణ తరగతులు నిర్వహించగా, మతం-మతోన్మాదం అంశంపై పిట్టల రవి బోధించారు. ఈ



రాజకీయ శిక్షణ శిబిరానికి రాళ్లబండి శశిధర్ ప్రిన్సిపాల్గా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గోడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, బండకింది అరుణ్కుమార్, అమ్ముల బాలనర్సయ్య, తాడూరి రవీందర్, సింగిరెడ్డి నవీన్, జాలిగపు శిరీషతో పాటు వివిధ శాఖల కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలి

సిద్దిపేట రూరల్ , జూన్ 13 ,(ప్రజాజ్యోతి):నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలను యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడికందుల రవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.హాస్టల్ బాత్రూమ్లు, టాయిలెట్లకు తలుపులు లేకపోవడం, ఉన్న తలుపులు పాడైపోవడం, నీటి పైప్లైన్లు లీకేజీలతో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పేద విద్యార్థుల వ్యక్తిగత భద్రత, గౌరవాన్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.విద్యార్థులు హాస్టళ్లకు చేరుకునేలోగా అన్ని బాత్రూమ్లకు కొత్త తలుపులు ఏర్పాటు చేయాలని, లీకేజీలను వెంటనే మరమ్మతులు చేయించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్ల హేమంత్, నాయకులు వంశీ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు సేవలో తనదైన ముద్ర వేసిన వ్యవసాయ విస్తీర్ణ అధికారి



## బదిలీపై వెళ్తున్న సంతోష్ కుమార్కు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించిన దొమ్మాట రైతు వేదిక క్లస్టర్ సర్పంచులు



దౌల్తాబాద్, జూన్ 13( ప్రజా జ్యోతి ) రైతు సేవలో తనదైన ముద్ర వేసిన వ్యవసాయ విస్తీర్ణ అధికారి సంతోష్ కుమార్ ను ఘనంగా సన్మానించిన దుమ్మాట క్లస్టర్ సర్పంచులు. శనివారం మండల పరిధిలోని దొమ్మాట సర్పంచ్ ఆంజనేయులు, గాజులపల్లి సర్పంచ్ పంజా స్వామి, లింగరాజు పల్లి సర్పంచ్ ప్రకాష్, తోపాటు ముత్యంపేట, సూరంపల్లి గ్రామ సర్పంచులు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు వ్యవసాయ శాఖ సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు వ్యవసాయ శాఖలో భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టారు. ఆ నియామకాల ద్వారా ఉద్యోగం సాధించి రైతు సేవలో తనదైన ముద్ర వేసిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) చింతకాయల సంతోష్ కుమార్కు దొమ్మాట రైతు వేదికలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఉమ్మడి మెదక్ జిల్లా కల్హేరు మండలం మహదేవ్పల్లి గ్రామానికి చెందిన పేద రైతు కుటుంబంలో సాయిలక్ష్మి, బాలయ్య దంపతుల మొదటి సంతానంగా జన్మించిన సంతోష్ కుమార్ 2013లో వ్యవసాయ విద్యను పూర్తి చేశారు. అనంతరం 2018లో వ్యవసాయ శాఖలో ఉద్యోగం సాధించి దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట క్లస్టర్కు క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారిగా నియమితులయ్యారు.దొమ్మాట, గాజులపల్లి, సూరంపల్లి, లింగరాజుపల్లి, ముత్యంపేట గ్రామాల రైతులకు సుమారు ఎనిమిదేళ్లపాటు సేవలందించిన ఆయన రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేయడంతో పాటు నూతన వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన కల్పించి అన్నదాతల మన్ననలు పొందారు.ఈ సందర్భంగా రైతు వేదిక పరిధిలోని సర్పంచులు, రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు సంతోష్ కుమార్ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.వీడ్కోలు సమావేశంలో సంతోష్ కుమార్ భావోద్వేగంగా మాట్లాడుతూ, ఎనిమిదేళ్లపాటు దొమ్మాట క్లస్టర్ రైతులకు సేవలందించడం తన జీవితంలో మరచిపోలేని అనుభవమని అన్నారు. ఉద్యోగంలో తొలిసారి చేరినప్పుడు అనేక సందేహాలు, భయాలు ఉన్నాయని, అయితే దొమ్మాట ప్రాంత రైతులు తనను ఉద్యోగిగా కాకుండా కుటుంబ సభ్యుడిగా ఆదరించారని తెలిపారు. ఉద్యోగంలో చేరి ఎనిమిదేళ్లు గడిచినా, అవి కేవలం కొన్ని నెలలుగా అనిపిస్తున్నాయని పేర్కొన్నారు.వ్యవసాయ శాఖలో తన ప్రయాణంలో మండల వ్యవసాయ అధికారి గోవిందరాజులు కీలక పాత్ర పోషించారని, సొంత తమ్ముడిలా భావించి ప్రతి అంశాన్ని ఓర్పుగా నేర్పించారని కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఏడీఏ శ్యాంసుందర్ తండ్రి పాత్ర పోషిస్తూ రైతుల సమస్యలను ఎలా అర్థం చేసుకోవాలి, గ్రామాల్లో ఎలా పని చేయాలనే విషయాల్లో మార్గనిర్దేశం చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఏడీఏ మల్లయ్య కూడా అధికారిగా ఎలా వ్యవహరించాలో విలువైన సూచనలు అందిస్తున్నారని ఆయన అదే మాదిరిగా దౌల్తాబాద్ మండలంలో అన్ని ఆ రాజకీయ పార్టీల నాయకులు ముఖ్యంగా జర్నలిస్టు మిత్రులు నా సేవలను గుర్తించి ప్రతి అంశాన్ని వారి వారి దినపత్రికలలో రైతులకు సంబంధించిన ప్రతి కథనాన్ని అన్నదాతలకు చేనివేసినందుకు వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని ఆయన అన్నారు.దొమ్మాట ప్రాంత ప్రజలు, రైతులు తనపై చూపిన ప్రేమాభిమానాలను జీవితాంతం మరిచిపోలేనని పేర్కొన్న ఆయన, తాను బదిలీపై వెళ్లినప్పటికీ రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, సందేహాలు ఎదురైతే ఫోన్ ద్వారా అయినా సేవలందించేందుకు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.రైతు వేదిక పరిధిలోని సర్పంచులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతోష్ కుమార్ సేవలను కొనియాడారు. ఆయన రైతులతో ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధం, సేవాభావం చిరస్మరణీయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ మండల యూత్ అధ్యక్షులు నర్ర రాజేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసిం, శ్రీధర్ రావు, స్వామి, పరశురాములు తోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.





# డిసిసిబి పగ్గాలు మళ్లీ చిట్టికే ?

## సోమవారం బాధ్యతల స్వీకరణ



కొండపాక, జూన్ 13: (ప్రజా జ్యోతి ):-ఉమ్మడి మెదక్ జిల్లా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) అధ్యక్ష పదవిని మరోసారి చిట్టి దేవేందర్ రెడ్డికి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డిసిసిబి పగ్గాలు మరోసారి చిట్టి చేతికే వెళ్లాయి.2019లో జరిగిన డిసిసిబి ఎన్నికల్లో కొండపాక మండలం నుంచి అత్యధిక మద్దతు సాధించిన చిట్టి దేవేందర్ రెడ్డి ఏకగ్రీవంగా డిసిసిబి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన పదవీకాలంలో సహకార రంగ బలోపేతానికి కృషి చేసిన ఆయన, రైతులకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువయ్యేలా పలు చర్యలు చేపట్టారు. అయితే, అధ్యక్షుడి పదవీకాలం ముగిసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎన్నికలు నిర్వహించకుండా కొంతకాలం పాటు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో డిసిసిబి వ్యవహారాలను కొనసాగించింది. అనంతరం సుమారు 20 రోజుల క్రితం మండల స్థాయి సహకార సంఘాలకు గతంలో పనిచేసిన డైరెక్టర్లు, అధ్యక్షులనే తిరిగి నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.ఈ క్రమంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి అధ్యక్ష బాధ్యతలను మరోసారి చిట్టి దేవేందర్ రెడ్డికి అప్పగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఆయన సోమవారం నాడు బాధ్యత లు స్వీకరించనున్నారు. ఈ ప్రకటనతో ఆయన అనుచరులు అనుచరులు, సహకార సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.చిట్టి దేవేందర్ రెడ్డి నాయకత్వంలో డిసిసిబి మరింత అభివృద్ధి చెందుతుందని, రైతులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లా సహకార రంగంలో రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం



## సర్పంచ్ పంజ స్వామి

దౌల్తాబాద్, జూన్ 13: ( ప్రజా జ్యోతి) నిరుపేద కుటుం బాలకు సహాయ నిధి వరమని సర్ప ంచ్ పంజా స్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన బొల్లి లచ్చయ్య తండ్రి మల్లయ్య కు ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 60 వేల రూపాయల చెక్కును సర్పంచ్ పంజ స్వామి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ నిరుపేద కుటుం బాలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదని ఆయన తెలియజేశారు. గ్రామంలో ఎవరైనా కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్న వారు వారి వర్జినల్ బిల్స్ డిశ్చార్జ్ సమ్మర్ను తమకు ఇస్తే సీఎం సహాయ నిధి ద్వారా పరిహారం అదేవిధంగా చూస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాశం యేసు ,కొలూరి భాస్కర్ రెడ్డి, మార్వాక కనకయ్య, పి ఎల్లయ్య, గాడి అఖిల్ ,గొల్లపల్లి రవి, రాములు తోపాటు తదితరులు పాల్గొన్నారు.